సాక్షి
కుమురం భీం
బుధవారం, 10, జనవరి, 2024



నిల్వ పత్తి.. జాగ్రత్తలు తప్పనిసరి
రైతులు ధర రావడం లేదని పంటను ఇళ్లలోనే నిల్వ చేస్తున్నారు. అన్నదాతలు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. 9లో▸



ఆదివాసీల ఆత్మబంధువులు
హైమన్ డార్ఫ్ ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపారు. జనవరి 11న సంప్రదాయం ప్రకారం డార్ఫ్ దంపతుల వర్ధంతి నిర్వహించనున్నారు. 10లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30.5 /17.5
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా తక్కువగా నమోదవుతాయి. చలి ప్రభావం కాస్త తగ్గుతుంది. పొగమంచు కురుస్తుంది.

సందేహాలెన్నో..?

- ఎస్9 పులిపై విష ప్రయోగం జరిగినట్లు నిర్ధారణ!
- పశువు మాంసాన్ని తిన్న మూడు పులులు
- రెండు మృత్యువాత... మూడోదాని ఉనికిపై స్పష్టత కరువు
- జిల్లా అటవీశాఖ తీరుపై విమర్శలు



కళేబరాలను దహనం చేస్తున్న అటవీశాఖ అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్/చింతలమానెపల్లి: జిల్లాలో ఎన్నడూ లేని విధంగా రెండు పెద్దపులులు మరణించడం సంచలనంగా మారింది. ఇందులో ఓ పులి విష ప్రయోగంతోనే మృత్యువాత పడినట్లు నిర్ధారణ కావడంతో కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో మిగిలిన పులుల ఉనికిపై సందేహాలు రేకెత్తుతున్నాయి. కాగజ్‌నగర్ మండలం దరిగాం అటవీ ప్రాంతంలో కే15, ఎస్9 పులుల కళేబరాలను రెండు రోజుల వ్యవధిలో గుర్తించిన విషయం తెలిసిందే. ఇందులో రెండేళ్ల వయస్సు ఉన్న ఆడపులి ఘర్షణలో మృత్యువాత పడగా.. ఐదేళ్ల మగ పులిపై మాత్రం విష ప్రయోగం జరిగిందని నిర్ధారణకు వచ్చారు. కే 15 పులి కళేబరం లభ్యమైన కొద్దిదూరంలోనే ఎస్9 చనిపోయి ఉంది. అయితే అధికారులకు దానిని గుర్తించేందుకు రెండు రోజుల సమయం పట్టింది. మంగళవారం పీసీసీఎఫ్(హెచ్‌వోఎఫ్ఎఫ్) ఆర్ఎం డోబ్రియల్, పీసీసీఎఫ్(సీడబ్ల్యూఎల్ డబ్ల్యూ) ఎంసీ పర్గేన్, సీసీఎఫ్ శాంతారాం, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టోబ్రివాల్ స్థానిక అధికారులతో కలిసి ఘటన స్థలంలో విచారణ చేపట్టారు. రెండో పులి తలకు ఉచ్చు బిగించి ఉన్నా విష ప్రయోగంతో చనిపోయినట్లు చెబుతున్నారు.

అధికారుల హైడ్రామా



మగపులి కళేబరం

కాగజ్‌నగర్ డివిజన్‌లో పులులు వరుసగా మృతిచెందడంతో అసలు విషయం బయటకు పొక్కకుండా అధికారులు హైడ్రామా చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మొదటి, రెండో పులి మృతి చెందిన ప్రదేశానికి ఎవరూ రావొద్దంటూ అటవీశాఖ అధికారులు ప్రాధేయపడటం గమనార్హం. మొదటి పులి మృతి చెందినప్పుడు అధికారులు ప్రకటించిన తీరు వారి హడావుడిని తెలియజేస్తుంది. రెండో పులి మృతిచెందిన అనంతరం రాష్ట్రస్థాయి అధికారులు సైతం ఇదేవిధంగా వ్యవహరించారు. పులి పశువుపై దాడి సందర్భంలో పశువు యజమానిని గుర్తించి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుంది. పశువు మాంసం తినడం కోసమే ఘర్షణ జరిగినట్లుగా భావిస్తున్నా.. విషప్రయోగం కోణంలో పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. సీసీ కెమెరాకు చిక్కిన పులుల వివరాలపైనా అధికారుల నుంచి సమాధానం రావడం లేదు. కళేబరాలను స్థానిక అటవీ ప్రాంతంలోనే దహనం చేయగా.. ల్యాబ్‌కు పంపిణీ నమూనాలను పరీక్షించిన తర్వాత పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

అనేక అనుమానాలు..

రెండు పులులు మృత్యువాత పడిన ఘటనపై జిల్లా అటవీశాఖ అధికారులు స్పందించిన తీరు వివాదాస్పదమవుతోంది. పారదర్శకంగా వ్యవహరించాల్సిన అటవీశాఖ అధికారులు హడావుడిగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించి ఘర్షణలో మృతి చెందాయని చెప్పి చేతులు దులుపుకున్నట్లుగా కనిపిస్తోంది. ఇది ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. గత డిసెంబర్ 31న కాగజ్‌నగర్ మండలంలోని దరిగాం, షెర్కపల్లి అటవీ ప్రాంతంలో పశువుపై పెద్దపులి దాడి చేసి హతమార్చింది. అనంతరం జనవరి 6న సరిగ్గా వారం రోజుల తర్వాత పులి(కే15) కళేబరాన్ని ఓ పశువుల కాపరి గుర్తించడంతో వెలుగులోకి వచ్చింది. తిరిగి రెండు రోజుల అనంతరం కే15 మృతిచెందిన ప్రదేశానికి సమీపంలోనే మెడకు ఉచ్చుతో ఉన్న ఎస్–9 పులి కళేబరాన్ని అటవీశాఖ అధికారులు గుర్తించారు. కే15.. రెండు పులుల మధ్య ఘర్షణలోనే మృతిచెందినట్లు అటవీశాఖ ప్రకటించింది. ఎస్9 పులి కళేబరం మాత్రం ఉచ్చుతో లభించడంతో బెబ్బులిని చంపేందుకు కుట్ర జరిగిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పులి దాడిలో చనిపోయిన పశువు యాజమాని వివరాలను ఇప్పటివరకు అటవీశాఖ బయటపెట్టడం లేదు. సాధారణంగా పులి దాడి చేసిన పశువును గుర్తించినప్పుడు పశువు యజమాని వివరాలు తెలుసుకుని ఆ ప్రాంతంలో సీసీ కెమెరా ఏర్పాటు చేయడం చేస్తారు. డిసెంబర్ 31న చనిపోయిన పశువు మాంసాన్ని కే15, ఎస్9తో పాటు మరో పులి తింటున్నట్లుగా తెలిపే సీసీ కెమెరా ఫుటేజీ అటవీశాఖ వద్ద ఉన్నట్లు సమాచారం. అయితే పశువు మాంసం తిన్న తర్వాత పులులు మృత్యువాత పడటం, ఒక పులి మెడకు ఉచ్చు ఉండటంతో మరో పులి ఆచూకీపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పశువుపై విష ప్రయోగం చేసి పులులు చంపేందుకు కుట్ర పన్నారనే ప్రచారం సాగుతోంది.



వివరాలు సేకరిస్తున్న అధికారులు



సేకరించిన నమూనాలు



అటవీ ప్రాంతంలో అధికారులు, వాహనాలు

స్పందన అంతంతే..!

- రాయితీ చలాన్ల చెల్లింపులపై వాహనదారుల నిరాసక్తత
- తొమ్మిది రోజుల్లో రూ.14,75,780 చెల్లింపులు
- నేటితో ముగియనున్న గడువు



ఆసిఫాబాద్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు చలాన్లు చెల్లించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించినా ఆశించిన స్పందన లేదు. రెండేళ్లుగా పెండింగ్ చలాన్ల క్లియరెన్స్‌కు ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటిస్తుంది. ఈ క్రమంలో గత నెల 26 నుంచి ఈ నెల 10 వరకు ఆన్‌లైన్‌లో పెండింగ్ చలాన్లు చెల్లించే వెసులుబాటు కల్పించింది.

48,228 కేసులు నమోదు

జిల్లాలో నిత్యం పోలీసు, ట్రాఫిక్ అధికారులు వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధిస్తున్నారు. ఓవర్‌లోడ్, ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకపోవడం, రాంగ్ పార్కింగ్, వాహన పత్రాలు లేని వారిపైనా కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా విధిస్తున్నారు. ఆటోమెటిక్ కెమెరాలతోపాటు చౌరస్తాల్లో సిగ్నల్ జంపింగ్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు సంబంధించి జరిమానాలు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. 15 మండలాల్లో గతేడాది జనవరి ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకు పోలీసులు 48,228 కేసులు నమోదు చేశారు. రూ.81,37,030 జరిమానా విధించారు. ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించడంతో పెద్దఎత్తున బకాయిలు వసూలు అవుతాయని అధికారులు భావించారు. పెండింగ్ బకాయిలు చెల్లించేందుకు కేవలం బుధవారం ఒకరోజు మాత్రమే గడువు ఉంది.

రూ.14,75,780 చెల్లింపులు

గతేడాది మొత్తం జిల్లా వ్యాప్తంగా 48,228 కేసులకు సంబంధించి రూ.81,37,030 జరిమానాలు పెండింగ్‌లో ఉన్నాయి. డిసెంబర్ 26 నుంచి జనవరి 9 వరకు 5434 మంది వాహనదారులు రూ.14,75,780 చెల్లించారు. ఇంకా 42,794 మంది రూ.66,61,250 బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒక్కో వాహనానికి రూ.వేలల్లో పెండింగ్ చలాన్లు ఉన్నప్పటికీ చెల్లించేందుకు యజమానులు ఆసక్తి చూపడం లేదు. కొంత మంది అవగాహన లేక రాయితీకి దూరమవుతుండగా.. మరికొంత మంది నిర్లక్ష్యంతో చలాన్లు చెల్లించడం లేదు.

రాయితీ ఇలా

ద్విచక్ర వాహనాలు, ఆటోల చలాన్లపై 80 శాతం రాయితీ, కార్లు, ట్రక్కులు, భారీ వాహనాలపై 60 శాతం, ఆర్టీసీ డ్రైవర్లు, తోపుడు వాహనాల చలాన్లపై 90 శాతం రాయితీని ప్రభుత్వం ప్రకటించింది.https://echallan.tspolice.gov.in/publicview ద్వారా పెండింగ్ చలాన్లు చెల్లించేందుకు అవకాశం ఉంది. జిల్లాలోని వాహనదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్పీ సురేశ్‌కుమార్ కోరారు.

'బేటీ బచావో– బేటీ పడావో'పై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులతో సమీక్షా సమావేశం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ఆసిఫాబాద్: జిల్లాలో బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా సంక్షేమ శాఖ, వైద్యారోగ్య, గిరిజనాభివృద్ధి, గ్రామీణ పేదరిక నిర్మూలన, పోలీసు శాఖ అధికారులు, మహిళా సాధికారత కేంద్ర సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమం ద్వారా భ్రూణ హత్యలు నివారించి ఆడపిల్లలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా అవగాహన కల్పించాలన్నారు. లింగ నిష్పత్తిలో ఆడపిల్లల శాతం పెరిగేందుకు కృషి చేయాలని సూచించారు. బాలికల విద్య, వైద్యం అందించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పదేళ్ల లోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిచేలా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ పంచాయతీల వారీగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలల్లో సెమినార్లు, పోటీ పరీక్షలు నిర్వహించడం, గోడరాతలు రాయడం, ప్రతిజ్ఞ చేయించడం, న్యూట్రిషియన్ కిట్లు అందించడం, బాల్యవివాహాలు లేని గ్రామాలకు ప్రోత్సాహకాలు అందించడం, బ్యానర్లు, ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేయయడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. సమావేశంలో డీఈవో అశోక్, జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, బాలలసంరక్షణ అధికారి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

12న తుడుందెబ్బ జిల్లా కమిటీ సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఈ నెల 12న ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా కమిటీ అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. త్వరలో మండల కమిటీలను ఏర్పాటు చేయడంపై, కమిటీల బలోపేతంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణి, రెబ్బెన మండలాలకు కమిటీలు వేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్ర పథకాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న కొత్తపల్లి శ్రీనివాస్

బెజ్జూర్(సిర్పూర్): కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మొబైల్ వాహనాన్ని మంగళవారం మండలంలోని మర్తిడిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి సపవత్ భిక్షపతి, నాయకులు మహేశ్, తిరుపతిగౌడ్, దిలీప్, రామయ్య, వెంకటేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతికి రూ.10కోట్లు కేటాయించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రూప్‌లాల్

కెరమెరి(ఆసిఫాబాద్): రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 15న నిర్వహించే సేవాలాల్ జయంతి వేడుకలకు ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో మంగళవారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే కోవ లక్ష్మిని వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందించారు. రూప్‌లాల్ మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ జయంతిని సెలవు రోజుగా ప్రకటించాలన్నారు. గిరిజన చట్టాల అమలుకు ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని, తండాల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య



ఫ్లెక్సీతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, టీచర్లు

ఆసిఫాబాద్‌రూరల్: గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశాలకు సంబంధించిన ఫ్లెక్సీని మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో గిరిజన బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ సురేశ్, ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. నాలుగో తరగతి విద్యార్థులు ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

టాస్క్ శిక్షణను వినియోగించుకోవాలి



డీఈవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: నిరుద్యోగ యువతీ యువకులు టాస్క్ శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలో టాస్క్ రీజినల్ కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి ఐటీ స్కిల్, సాఫ్ట్ స్కిల్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. డీఈవో మాట్లాడుతూ టాస్క్ శిక్షణ తరగతుల ద్వారా టెక్నికల్ జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. మేనేజర్ సాయికుమార్, పరీక్ష నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమ కోసం వైద్యశిబిరాలు



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: పోలీసు అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్‌టౌన్ పోలీస్ స్టేషన్, శరత్ మ్యాక్సి విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి(హనుమకొండ) ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు నేత్ర వైద్యశిబిరం ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేసే పోలీసులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డిజిటల్ యుగంలో టీవీ, మొబైల్ అధికంగా వాడటంతో కంటి సమస్యలు పెరుగుతున్నాయన్నారు. త్వరలో ఆసిఫాబాద్‌లోనూ కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు, తదితరులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, సీఐలు బుద్దే స్వామి, నాగరాజు, సీనియర్ ఆప్తామాలజిస్ట్ అశోక్, కోఆర్డినేటర్ మహేందర్, కౌన్సిలర్ అజయ్, ఎస్సైలు అంజన్న, శ్రీకాంత్, కల్యాణ్, రామన్ కుమార్, సోనియా తదితరులు పాల్గొన్నారు.

క్యాంపులోనే కౌన్సిలర్లు

- రసవత్తరంగా కాగజ్‌నగర్ మున్సిపల్ రాజకీయాలు
- విజయవాడకు మకాం మార్చిన పాలకవర్గ సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సిద్ధమైన మెజార్టీ కౌన్సిలర్లు క్యాంపులోనే ఉన్నారు. మొదట హైదరాబాద్‌లో మకాం వేసిన వారు తాజాగా మంగళవారం ఉదయం విజయవాడకు బయలుదేరినట్లు తెలిసింది. కాగజ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, వైస్ చైర్మన్ గిరీష్ కుమార్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ మెజార్టీ కౌన్సిలర్లు కలెక్టరేట్‌కు వెళ్లి వినతి పత్రం సమర్పించిన విషయం విధితమే. ఈ మేరకు జనవరి 20న కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా వార్డుల సభ్యులకు ఉత్తర్వు కాపీలు సైతం అందడంతో మెజార్టీ కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. పాలకవర్గం రెండు వర్గాలుగా ఏర్పడి ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా పావులు కదుపుతోంది. చైర్మన్, వైస్ చైర్మన్లు పదవులను కాపాడుకోవడానికి ప్రయత్నాలు ముమ్మరం చేయగా, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలోని పాలకవర్గం వారి ప్రయత్నాలు సైతం తీవ్రతరం చేస్తోంది.

ఆన్‌లైన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి

ఆసిఫాబాద్/జైనూర్: ప్రజాపాలన కార్యక్రమంలో స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంతోపాటు జైనూర్ మండల పరిషత్ కార్యాలయాల్లో కొనసాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 లోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రభుదయ, తదితరులు ఉన్నారు.

రాంగ్ రూట్‌లో వెళ్లి.. లారీని ఢీకొట్టి

- స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ప్రమాదం
- డ్రైవర్‌తోపాటు నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు
- మరో 10 మందికి స్వల్పగాయాలు



చికిత్స పొందుతున్న విద్యార్థులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన స్కూల్ బస్సు ముందు భాగం

రెబ్బెన(ఆసిఫాబాద్): స్కూల్ పిల్లలను సురక్షితంగా ఇంటికి చేర్చాల్సిన డ్రైవర్ నిర్లక్ష్యం 14 మంది విద్యార్థులను గాయాల పాలుచేసింది. మరో 10 నిమిషాల్లో ఇంటికి చేరుతారని అనుకున్న సమయంలో జరిగిన యాక్సిడెంట్ విద్యార్థులను ప్రమాదంలోకి నెట్టింది. అదృష్టవశాత్తు చిన్నారులు గాయాలతో బయటపడ్డారు. జాతీయ రహదారిపై స్కూల్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అజాగ్రత్తతో వాహనాన్ని రాంగ్‌రూట్‌లో నడిపి ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టిన ఘటన మంగళవారం రెబ్బెన మండలం ఇందిరానగర్ సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు మరో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. 10 మంది స్వల్పంగా గాయపడ్డారు. రెబ్బెన మండల కేంద్రంలోని అన్నపూర్ణ హైస్కూల్ పాఠశాలలో ఇందిరానగర్, కాగజ్‌నగర్ ఎక్స్, ఎడవెల్లి ప్రాంతాల విద్యార్థులు చదువుతున్నారు. ప్రతిరోజూ స్కూల్ బస్సులోనే విద్యార్థులను తీసుకువచ్చి సాయంత్రం మళ్లీ ఇళ్ల వద్ద దింపుతున్నారు. మంగళవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత ఇందిరానగర్, కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్, ఎడవెల్లి ప్రాంతాలకు చెందిన విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని స్కూల్ బస్సు డ్రైవర్ గందె సుధాకర్ బయలుదేరాడు. ఇందిరానగర్ వద్ద విద్యార్థులను దింపిన అనంతరం డివైడర్ గుండా సరైన మార్గంలో వెళ్లాల్సిన బస్సును రాంగ్‌రూట్‌లో నడుపుకుంటూ వెళ్లాడు. ఈ క్రమంలో కాగజ్‌నగర్ ఎక్స్‌వైపు వెళ్తున్న క్రమంలో జాతీయ రహదారిపై ఎదురుగా మహారాష్ట్ర వైపు నుంచి వస్తున్న లారీని ముందు భాగంలో ఢీకొట్టాడు. బస్సు ముందు భాగం దెబ్బతినడంతో డ్రైవర్ రెండు కాళ్లు ఇరుక్కుపోయాయి. బస్సులోని విద్యార్థుల్లో విజయలక్ష్మి తలకు, అంకిత్ కుడి భుజానికి, రాంచరణ్ తలకు, నిఖిల్ ఎడమ చేతికి, కుడి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ధనుష్, అన్షిత్, అభినయ్, అశ్విత్, దేవికాశ్రీ, అధ్యశ్రీ, రవిచంద్ర, అక్షిత, ధనుష్, శ్రావ్య స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్సులో గాయపడిన వారిని కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బస్సు క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీసి మంచిర్యాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ నిర్వాకంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీ డ్రైవర్ తిరుపతిరావు ఫిర్యాదు మేరకు సుధాకర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా సాగాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన పరిమితికి లోబడి ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశాలు, ప్రకటనలు.. ఇలా ప్రతీ ఖర్చు వివరాలను సమర్పించాలని సూచించారు. పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు అధికారులకు సహకరించాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో మేక మృతి


మృతి చెందిన మేక వద్ద రైతు

నెన్నెల: మండలంలోని నార్వాయిపేటలో విద్యుద్ఘాతంతో మేక మృతి చెందింది. అదే గ్రామానికి చెందిన కున్సోతు సార్యానాయక్‌కు చెందిన మేక మంగళవారం మేత కోసం గ్రామ సమీపంలోని పంట చేను వైపు వెళ్లింది. అల్లూరి బాపు అనే రైతు పంట పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ కిందకు ఉండటంతో అటుగా వెళ్లిన మేక ఎర్త్‌వైర్‌కు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మేక విలువ రూ.12వేలు ఉంటుందని ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. ఐదు నెలల క్రితం ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి లావుడియా హరీష్‌సింగ్ నాయక్‌కు చెందిన మేక మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ కిందికి ఉండటంతోనే ఈ ప్రమాదం సంభవిస్తుందని ఎత్తు పెంచి చుట్టు కంచె ఏర్పాటు చేసేలా విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

డెంగీతో ఒకరి మృతి


పల్లె లక్ష్మణ్(ఫైల్)

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రానికి చెందిన పల్లె లక్ష్మణ్ (36) డెంగీతో సోమవారం రాత్రి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో మృతి చెందాడు. కుటుంబీకుల వివరాల ప్రకారం... లక్ష్మణ్‌కు ఆరు రోజుల క్రితం జ్వరం రావడంతో కుటుంబీకులు మంచిర్యాలలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించకముందే ఫిట్స్ రావడంతో మృతి చెందాడు. లక్ష్మణ్‌కు భార్య సంధ్యారాణి, కుమారుడు గణేష్, కూతురు శరణ్య ఉన్నారు.

పెద్దపల్లి ఎంపీ సీటు కోసం ఏమాజీ దరఖాస్తు

బెల్లంపల్లి: పెద్దపల్లి ఎంపీ టికెట్ కోసం బెల్లంపల్లికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ దరఖాస్తు చేశాడు. మంగళవారం కరీంనగర్‌లో బీజేపీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ జాతీయ నాయకుడు, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, జాతీయ కార్యదర్శి బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఇతర నాయకులు హాజరయ్యారు. ఈ సమావేశంలో భాగంగా ఏమాజీ పెద్దపల్లి ఎంపీ సీటు కోసం దరఖాస్తు ఫారం, బయోడేటాను అందజేశాడు. ఎంతో నిబద్ధతతో పార్టీ నిర్మాణం కోసం కృషి చేస్తున్న తనకు టికెట్ ఖరారు చేయాల్సిందిగా కోరినట్లు ఏమాజీ తెలిపారు.

క్రీడాకారుడికి అభినందనలు


రాజలింగును అభినందిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్: ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన మాస్టర్స్ రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మందమర్రికి చెందిన సీనియర్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పళ్లెం రాజలింగు 75 ఏళ్ల ప్లస్ విభాగంలో సింగిల్స్, డబుల్స్ విభాగంలో విన్నర్‌గా నిలిచి గోల్డ్ మెడల్ సాధించాడు. అతడిని మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందించారు. జిల్లాకు మంచి పేరు తీసుకు వచ్చినందుకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. జిల్లా యువజనుల క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి పుల్లూరు సుధాకర్ పాల్గొన్నారు.

ఉచితం ఉత్తదేనా..!


కొనసాగుతున్న సెప్టిక్ ట్యాంకు పనులు

- టెండర్లు పూర్తయి ఏడాది
- తెరుచుకోని ఉచిత మరుగుదొడ్ల తలుపులు
- కాంట్రాక్టర్, అధికారుల మధ్య సమన్వయ లోపం
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు


మంచిర్యాలలో మూసివేసిన మరుగుదొడ్లు

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికులకు ఉచితంగా అందించాలనే మరుగుదొడ్ల (టాయిలెట్)సేవలు ఉత్తదిగానే మారింది. రాష్ట్రంలో జూబ్లీ బస్‌స్టేషన్‌తో పాటు పలుచోట్ల మరుగుదొడ్ల సేవలు ప్రారంభమైన మంచిర్యాల డిపో పరిధిలో మాత్రం నోచుకోవటం లేదు. టెండర్లు పూర్తిచేసిన అధికారులు, గుత్తేదారుల మధ్య సమన్వయం లోపంతో మరుగుదొడ్లు వినియోగంలోకి రాకుండా పోయాయి. దీంతో ఉన్నా మరుగుదొడ్లకు తలుపులకు తాళం పడ్డాయి. గతంలో గుత్తేదారుకు మరుగుదొడ్లు నిర్వహణ బాధ్యతలు అప్పగించిన నిర్ణీత డబ్బులు కాకుండా అధికంగా వసూలు చేయటం.. ఆర్టీసీ సంస్థకు చెల్లించే డబ్బుల్లో జాప్యంతో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ యాజమాన్యమే మరుగుదొడ్ల నిర్వహణ గుత్తేదారుకు అప్పగించి డబ్బులు చెల్లించాలని యాజమాన్యం నిర్ణయించింది. ఏడాది కిందట టెండర్లు పూర్తయినా ఫ్రీ టాయిలెట్లు అందుబాటులోకి రాకుండా పోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహలక్ష్మీ పథకం ప్రవేశపెట్టింది. బస్సుల్లో ఫ్రీ జర్నీతో మహిళ ప్రయాణికుల సంఖ్య అంతకంతకు పెరిగిపోతోంది. మంచిర్యాల బస్‌స్టేషన్‌లో దిగిన మహిళ ప్రయాణికులు కాలకృత్యాలకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పటం లేదు.

ఏడాదికి పైగా మరుగుదొడ్లకు తాళం...

మంచిర్యాల ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే మరుగుదొడ్లకు ఏడాదికిపైగా తాళం దర్శనమిస్తోంది. గుత్తేదారు సంస్థకు చెల్లించాల్సిన డబ్బులు సకాలంలో చెల్లించకపోవడంతో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో ఉచిత మరుగుదొడ్ల సేవలకు గత ఏడాది 2022 డిసెంబర్‌లో కొత్త టెండర్లు నిర్వహించింది. మంచిర్యాల బస్‌స్టేషన్‌లో గుత్తేదారు నిర్వహణకు ముందుకొచ్చింది. టాయిలెట్ల నిర్వహణకు అవసరమైన విద్యుత్, నీటి సమస్య, విరిగిన నల్లాలు తదితర సమస్యలు నెలకొన్నాయి. బోర్‌వెల్ వేయడంతో నీటి సమస్యకు చెక్‌పడింది. నల్లాల బిగింపు, తలుపులు, విద్యుత్ లాంటి చిన్న మరమ్మతులపై గుత్తేదారు.. యాజమాన్యం మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. దీంతో ఏడాదిగా మరుగుదొడ్లకు దూరం కావాల్సి వస్తోంది. ఫ్రీ టాయిలెట్లు లేక.. మూసేసినా మూత్రశాలలతో మహిళలు పడుతున్న బాధలు వర్ణనాతీతం.

> **త్వరలోనే ఉచిత టాయిలెట్లు..**
>
> ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో త్వరలోనే ఉచిత టాయిలెట్లు అందుబాటులోకి రానున్నాయి. సెప్టిక్‌ట్యాంకు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఫ్రీ మరుగుదొడ్లు వినియోగిస్తే ప్రయాణికులు డబ్బులు చెల్లించాల్సిన అవసరం ఉండదు. పనులు పూర్తయితే ఫ్రీ టాయిలెట్లు అందుబాటులోకి వస్తాయి.
>
> – రవీంద్రనాథ్, మంచిర్యాల డీఎం

ప్రైవేట్ మరుగుదొడ్లలో అందినకాడికి వసూలు..

ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో మూతపడిన మరుగుదొడ్లను అవకాశం తీసుకున్న నిర్మల్ ఫౌండేషన్ సంస్థ ప్రయాణికులను అందినకాడికి దోచుకుంటుంది. మూత్రశాలకు వెళ్లితే రూ.2తీసుకోవాల్సి ఉండగా రూ.5, మరుగుదొడ్లకు వెళ్లితే రూ.10లు వసూలు చేస్తుండడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1800 స్క్వేర్ ఫీట్లు స్థలంలో నిర్మాణం చేపట్టారు. బీవోటీ కింద 25ఏళ్ల లీజుతో మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టారు. ప్రయాణికుల నుంచి నిర్ణీత వసూలు చేయాల్సి ఉంది. ఇదివరకు ప్రయాణికుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తుండగా ఆర్టీసీ విజిలెన్స్, సెక్యూరిటీ ఆధ్వర్యంలో తనఖీలు చేపట్టి జరిమానా విధించారు. అయినప్పటికీ సంస్థ నిర్వాహకుల్లో మార్పు రావడం లేదు. ఫ్రీ మరుగుదొడ్ల మాటేలా ఉన్నా సంస్థ ఆధ్వర్యంలో నడిచే టాయిలెట్లు మూసివేయడంతో ఏడాదికిపైగా ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. ప్రైవేట్‌లో అధిక వసూలుపై కట్టడి చేయటం.. ఉచిత మరుగుదొడ్లు వినియోగంలోకి తేవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నిలిచిన స్ట్రక్చరల్ సమావేశాలు



శ్రీరాంపూర్ ఏరియా ముఖ ద్వారం

- మూడేళ్ల నుంచి బంద్
- పెండింగ్‌లో కార్మికుల సమస్యలు
- కొత్త గుర్తింపు సంఘమైన చొరవ చూపేనా..?

శ్రీరాంపూర్: సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అసలైన వేదికలు స్ట్రక్చరల్ సమావేశాలు. శ్రీరాంపూర్‌లో ఈ స్ట్రక్చరల్ సమావేశాలు మూడేళ్ల నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఏరియా స్థాయిలో ప్రతి నెల గుర్తింపు సంఘానికి, యాజమాన్యానికి మధ్య ఈ స్ట్రక్చరల్ సమావేశం జరుగుతుంది. గుర్తింపు సంఘం నుంచి ఆరుగురు ప్రతినిధులు, యాజమాన్యం తరుపున జీఎం, ఇతర అన్ని డిపార్టుమెంట్ల ముఖ్య అధికారులు ఈ సమావేశంలో పాల్గొంటారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తింపు సంఘం నాయకులు అధికారుల దృష్టికి తీసుకుపోతారు. ప్రతీ సమావేశంలో గుర్తింపు సంఘం ఆరు డిమాండ్లను ఇందులో పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తోంది. నిబంధనల ప్రకారం జరుగాల్సిన ఈ సమావేశాలు గడిచిన మూడేళ్లుగా పూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ కేంద్ర నాయకత్వం వైఫల్యంతో కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో కూడా ఈ సమావేశాలు జరుగలేదు. దీనికి తోడు కంపనీ లెవల్‌లో సీఎండీ స్థాయి, డైరెక్టర్(పా) స్థాయి సమావేశాలు కూడా జరుపడం లేదు. నాటి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలే కంపెనీ సమస్యలపై నేరుగా స్పందించి అధికారులకు ఆదేశాలిచ్చే వ్యవహారాలు చేయడంతో ఈ స్ట్రక్చరల్ సమావేశాలు మరుగునపడ్డాయి.

ఏఐటీయూసీ నేతలు చొరవ చూపాలి

కొత్తగా గుర్తింపు సంఘంగా గెలిచిన ఏఐటీయూసీ నేతలు ఈ సమావేశాల ఏర్పాటుపై చొరవ చూపాలని కార్మికులు కోరుతున్నారు. ఈ సమావేశాలు నిర్వహిస్తే అనేక పెండింగ్ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని వారు పేర్కొంటున్నారు. ఏరియా స్థాయితో పాటు కంపెనీ స్థాయిలో జరుగాల్సిన సమావేశాలపై కూడా ఆయూనియన్ నాయకత్వం కృషి చేయాలని కార్మికవర్గం పేర్కొంటుంది.

> **శ్రీరాంపూర్‌లో సమస్యలు అనేకం..**
>
> శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. గనుల్లో ఎస్‌డీఎల్ యంత్రాల స్పేర్స్ కొరత అధికంగా ఉంది. మైనింగ్ స్టాఫ్ కొరతతో ఉన్న వారిపైనే పనిభారం పెంచుతున్నారు. సేఫ్టీ కోసం రూఫ్‌కు సపోర్టుగా వాడే 6ఫీట్ల సపోర్టు కర్ర దిమ్మలు కొరత తీవ్రంగా ఉంది. వాటిని కూడా సరిపడా సరఫరా చేయడం లేదు. ప్రతీ చలికాలంలో ఇవ్వాల్సిన వార్మ్ కోట్ల(చలికోట్లు) ఇవ్వడం లేదు. కొన్ని గనుల్లో మ్యాన్‌పవర్ కొరత తీవ్రంగా ఉంది. మరికొన్ని గనుల్లో ఎక్సెస్ ఉంది. ముఖ్యంగా సివిల్ డిపార్టుమెంట్‌లో సమస్యలు అనేకం. క్వార్టర్ల కిటికీలు, డోర్లు, వైరింగ్ మరమ్మతుల కోసం కార్మికుల కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారు. కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఇలాంటి సమస్యల పరిష్కారానికి గతంలో చేపట్టిన పాదయాత్రలను కూడా పూర్తిగా బంద్ చేశారు. దీనికి తోడు ఇంకా ఉద్యోగులు వృత్తిపరమైన ప్రమోషన్లు, సర్వీసు ఇబ్బందులు కూడా ఉన్నాయి. స్ట్రక్చరల్ సమావేశాలు జరుగుతే గుర్తింపు సంఘం నాయకులు వీటిని యాజమాన్యం దృష్టికి తీసుకుపోతే వాటికి పరిష్కారం లభించే అవకాశం ఉంటుంది.

గంజాయి కేసులో నిందితుల బైండోవర్

నెన్నెల: గంజాయి అక్రమ రవాణా, విక్రయం కేసుల్లో నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బైండోవర్ చేశారు. మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన దూత ప్రశాంత్, ఏస్కూరి శశికుమార్‌లు గతంలో గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. రామగుండం సీపీ రెమారాజేశ్వరి ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిందితులను బైండోవర్ చేసినట్లు ఇన్‌చార్జి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మరోసారి గంజాయి అక్రమ రవాణా చేస్తే జైలు శిక్షను తప్పదని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌ను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు.

జన్నారం: గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితులుగా ఉన్న మండలంలోని మహ్మదాబాద్‌కు చెందిన కామెర నగేశ్‌ను మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో గంజాయి అక్రమ రవాణ కేసుల్లో నిందితుడిగా ఉన్న పలువురిని బైండోవర్ చేయాలనే ఆదేశాల మేరకు నగేశ్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని, ఏడాది వరకు గంజాయి అక్రమ రవాణకు పాల్పడితే జైలు శిక్ష తప్పదని తెలిపారు.

‘డబుల్’ పంపిణీ జరిగేనా..?

- రెండు మున్సిపాలిటీలలో పంపిణీకి సిద్ధం
- ఎదురుచూస్తున్న లబ్ధిదారులు


మందమర్రిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్‌లు

చెన్నూర్: పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెన్నూర్ నియోజకవర్గంలో చెన్నూర్, మందమర్రి, క్యాతన్‌పల్లి మూడు మున్సిపాలిటీలలో 1516 డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణానికి 75.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. మందమర్రి 680, క్యాతన్‌పల్లిలో 286 డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణాలకు నిధులు విడుదల చేయగా, మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలలో నిర్మాణాలు పూర్తయ్యాయి. చెన్నూర్‌లో డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణం పునాదిలకే పరిమితమయ్యాయి. రెండు మున్సిపాలిటీలలో నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారా లేదా అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

చెన్నూర్‌లో ముందుకుసాగని నిర్మాణాలు..

చెన్నూర్ మున్సిపాలిటీలో పరిధిలోని జాతీయ రహదారి పక్కన గల జగన్నాథుల కుంట సమీపంలో తొలుత 350 డబుల్ బెడ్ రూమ్‌ల నిర్మాణానికి పూనుకున్నారు. నిర్మాణం పనులు పునాది స్థాయికి చేరాయి. పునాదుల స్థాయిలో ఇంటి నిర్మాణాలకు ఈ స్థలం అనువుగా లేదని చెప్పడంతో ఇందిరానగర్ కాలనీ సమీపంలో 550 డబుల్ బెడ్‌రూమ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెండు చోట్ల పనులు ముందుకు సాగలేదు. చెన్నూర్ మున్సిపాలిటీలోని నిరుపేదలకు సొంతింటి కల కలగానే మిగిలింది.

మందమర్రిలో ప్రారంభం...

మందమర్రి, క్యాతన్‌పల్లిలో నిర్మించిన గృహాలను గతంలో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. లబ్ధిదారుల ఎంపిక కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు. ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిలిచిపోయింది.

> **కానరాని సౌకర్యాలు..**
>
> మందమర్రి, క్యాతన్‌పల్లిలలో డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మాణాలు పూర్తి అయినప్పటికీ రోడ్లు, విద్యుత్ లైన్లు లాంటి సౌకర్యాలు కల్పించలేదు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి పంపిణీ చేయాలంటే రోడ్లు, విద్యుత్ లైన్లు నిర్మించి పంపిణీ చేయాలి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం ద్వారా పేదలకు పంపిణీ చేస్తుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం


పత్తిమిల్లులో కాలిపోయిన పత్తిని ఏరుతున్న కూలీలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ఆదిశంకరాచార్య జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం మంగళవారం చోటుచేసుకుంది. పత్తిని సరిచేసే దోజర్ పైపు కాలిపోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానిక సిబ్బంది చెన్నూర్‌లోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకొని సిబ్బంది మంటలను ఆర్పేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు ఐదు క్వింటాళ్ల వరకు పత్తి కాలిపోయిందని మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం


లింగాపూర్: వివరాలు సేకరిస్తున్న ఆర్‌ఐ

లింగాపూర్: విద్యుద్ఘాతంతో పత్తి పంట దగ్ధమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన జాదవ్ ఇందల్ అనే రైతు ఇంట్లో పత్తి పంటను ఉంచాడు. మంగళవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి పంటకు మంటలు అంటుకున్నాయి. గమనించిన కుటుంబీకులు నిద్రలోంచి లేచి మంటలు ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ ప్రకాశ్ చేరుకుని పరిశీలించారు. ఇంట్లో 30 క్వింటాళ్ల పత్తి ఉండగా సుమారుగా 5క్వింటాళ్ల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కౌటాల: మండలంలోని విజయనగరం గ్రామానికి చెందిన పోలిశెట్టి బాలస్వామి(48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై ఎస్.మధుకర్ మంగళవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీన కుటుంబీకులు హైదరాబాద్‌కు వెళ్లగా బాలస్వామి ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. అదే రోజు రాత్రి ద్విచక్ర వాహనంపై తన పొలానికి వెళ్తున్న క్రమంలో గుడ్లబోరి సమీపంలో బైక్ అదుపు తప్పి వంతెనను ఢీ కొంది. దీంతో బాలస్వామి, బైక్ వంతెన కింద చెట్ల పొదల్లో పడిపోయారు. రాత్రి కావడంతో ఎవరు గమనించలేదు. కుటుంబీకులు ఫోన్ చేసిన తీయకపోవడంతో అనుమానం వచ్చి మంగళవారం కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి ఆచూకీ కోసం గాలించారు. ఈ క్రమంలో వంతెన కింద పడి మృతి చెంది ఉన్న బాలస్వామి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి కుమార్తె ప్రసన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి


దీక్షలో కూర్చున్న రైల్వే కార్మికులు

బెల్లంపల్లి: కొత్త పెన్షన్ విధానాన్ని బేషరతుగా రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బెల్లంపల్లి బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగరాజు, జి.శివనాగవరప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలో రైల్వే కార్మికుల సమస్యలపై నిరాహార దీక్ష చేపట్టారు. రైల్వే కార్మికులకు పూలమాల వేసి దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీర్ఘకాలంగా రైల్వే కార్మికుల సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నాయని తెలిపారు. పింఛన్ సమస్యతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పాత పెన్షన్ విధానం అమలులో పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇతర రంగాల్లో మాదిరిగా రైల్వేలో ప్రైవేటీకరణ యత్నాలు కొనసాగించడం సరికాదన్నారు. దేశంలో అతిపెద్దదైన రైల్వేను ఆధునీకరించి కొత్తగా ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి ప్రైవేటీకరణకు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. రైల్వే ప్రైవేటీకరణ వల్ల దేశానికి నష్టం కలుగుతుందని తెలిపారు. పెట్టుబడిదారులకు లాభం కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ జపం చేస్తోందని మండిపడ్డారు. ఐక్యపోరాటాల ద్వారా కార్మికులు హక్కులు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. దీక్ష శిబిరాన్ని కాంగ్రెస్ నాయకులు జి.శ్రీనివాస్, లెంకల శ్రీనివాస్, ఎంప్లాయిస్ సంఘ్ సీనియర్ నాయకులు యాదగిరి, ఎస్సీ, ఎస్టీ సంఘం సెక్రెటరీ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

సైబర్ మోసాలపై జాగ్రత్త

- జీఎం సంజీవరెడ్డి



ఉద్యోగులతో మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సైబర్ మోసాలపై సింగరేణి ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్పొరేట్ ఐటీ హెచ్‌ఆర్డీ డిపార్టుమెంట్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎం మాటాల్డారు. ప్రపంచ వ్యాప్తంగా సైబర్ మోసాలు పెరుగుతున్నాయని అన్నారు. ఆర్థిక లావాదేవీల కోసం మొబైల్, కంప్యూటర్ వినియోగం పెరగడం వల్ల వీటి మీదనే సులువుగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశ్యంతో కొందరు సైబర్‌మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఫోన్‌లు, మెస్సేజ్, మెయిల్స్ ద్వారా వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు చెప్పాలని అడిగే అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ వీటిపై అవగాహన కలిగి ఉంటే మోసపోరని తెలిపారు. కంపెనీలో ఇలాంటి సైబర్ నేరాలను అరికట్టడం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేట్ డీజీఎం (ఐటీ) శ్రీనివాసరావు ఏరియా ఎస్‌ఓటు జీఎం కే.రఘుకుమార్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏజెంట్ గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం చిరంజీవు, ఐటీ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరానికి తెలంగాణ మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు 6వ, 7వ తరగతి నుంచి 10 వరకు మిగుల సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి యాదయ్య తెలిపారు. 22 ఫిబ్రవరి 2024 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన ఆరో తరగతికి ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, 7 నుంచి 10వ తరగతుల మిగుల సీట్లకు మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆన్‌లైన్ నమోదు పకడ్బందీగా నిర్వహించాలి


ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న జేడీ

నస్పూర్: ప్రజాపాలనలో భాగంగా ఇటీవల స్వీకరించిన అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా స్వీకరించాలని మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ కె.నారాయణరావు తెలిపారు. మంగళవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు మంచిర్యాల ఆర్డీఓ రాములు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఈనెల 12న మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానంపై సమావేశం ఉన్నందున ఏర్పాట్లను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ టి. రమేశ్, ఆర్‌వో సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బొగ్గు రవాణాకు సహకరించాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో లారీ యాజమానులు బొగ్గు రవాణాకు సహకరించాలని యాజమాన్యం ఒక ప్రకటన జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రోడ్డు ప్రమాదాలపై చేసిన కొత్త చట్టం ప్రకారం డ్రైవర్లకు పదేళ్ల జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా వంటి అంశంపై దేశ వ్యాప్తంగా ఆలిండియా మోటార్ ట్రాన్స్‌పోర్టు కాంగ్రెస్ ప్రతినిధులు ముందే సమ్మె పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల 2న కేంద్రమంత్రితో జరిగిన సమావేశంలో ఈ చట్టాన్ని ఇప్పుడే అమల్లోకి తేవడం లేదని మంత్రి ఇచ్చిన హామీతో దేశ వ్యాప్తంగా ట్రాన్స్‌పోర్టు ప్రతినిధులు సమ్మె విరమించుకున్నట్లు ప్రకటించారని తెలిపారు. సింగరేణిలో కూడా లారీ యాజమానులు కూడా ఈ నిర్ణయం మేరకు నడుచుకొని లారీలను నడిపించి బొగ్గు రవాణాకు సహకరించాల్సిందిగా కోరారు.

పత్తి కొనుగోళ్లు బంద్

చెన్నూర్: చెన్నూర్ పట్టణంతోపాటు మండలంలోని నాలుగు జిన్నింగ్ మిల్లుల్లో ఈ నెల 10 నుంచి 16 వరకు వారం రోజులపాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులు, సీపీవో ఉదయ్‌షా తెలిపారు. నాలుగు పత్తి మిల్లుల్లో నిల్వ ఎక్కువ ఉండడంతో కొనుగోళ్లను నిలిపివేసినట్లు తెలిపారు.

స్థానిక కార్మికులకు అన్యాయం

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో స్థానిక కాంట్రాక్ట్ కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వకుండా స్థానికేతరులను ప్రమోట్ చేయడంపై స్థానిక కాంట్రాక్టు కార్మికులు, భూనిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏడేళ్లుగా పవర్ ప్లాంటులో పని చేస్తున్నప్పటికీ స్థానికులకు అర్హతకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా అన్‌స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలను చెల్లిస్తూ ఇటూ సింగరేణి అధికారులు, అటూ పవర్‌ప్లాంటు నిర్వహణ చేపడుతున్న పవర్‌మేక్ కంపెనీ యాజమాన్యం కార్మికులను మోసం చేస్తుందన్నారు. ఇటీవల సింగరేణి అధికారులు ఇంజినీరింగ్ డిపార్టుమెంట్‌లో ఎలాంటి అనుభవం లేని టౌన్‌షీపులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న స్థానికేతరుడైన ఓ వ్యక్తిని సీహెచ్‌పీలో ఎలక్ట్రికల్‌లో ఏకంగా సీనియర్ ఇంజినీరింగ్‌గా నియమించడంపై విమర్శలు వ్యక్తమవున్నాయి.